క్లుప్తంగా

అలరించిన సంగీత గాత్రకచేరీ



సంగీత కచేరీలో కళాకారులు

కవిటి: స్థానిక పట్టాభిరామ కళాపీఠంలో సీతారామ త్యాగరాజ 63వ వార్షికోత్సవాలు, 47వ అన్నమాచార్య వార్షికోత్సవాలలో భాగంగా బుధవారం నిర్వహించిన గాత్రకచేరీ సంగీత ప్రియుల్ని ఆద్యంతం సంగీత సాగరంలో ఓలలాడించింది. హైదరాబాద్‌కు చెందిన ఎస్.మహాలక్ష్మి గాత్రానికి వయోలిన్‌తో మహావాది వాసుశాస్త్రి, మృదంగంతో ధన్వాడ ధర్మారావు, ఘటంతో హనుమంతరావు సహకార వాయిద్యాలు అందించారు. కళాకారులను పట్టాభిరామ కళావేదిక నిర్వాహకులు బెందాళం కామరాజు, బెందాళం నారాయణమూర్తి సోదరులు సత్కరించి జ్ఞాపికలను అందించారు.

జోరుగా పెదంచల రోడ్డు పనులు



చినంచల గ్రామం వద్ద నిర్మాణం జరిగిన రోడ్డు

కాశీబుగ్గ: పలాస మండలం పెదంచల గ్రామం నుంచి పలాస పట్టణాని చేరుకునే పెదంచల ఆర్అండ్‌బీ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సుమారు పది కిలోమీటర్ల పొడవున్న రోడ్డును రెండు కోట్ల 15 లక్షల రూపాయలతో నిర్మిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా కాస్త నెమ్మదిగా జరిగిన పనులు ఇప్పుడు జోరందుకున్నాయి. రోడ్డు పూర్తయితే పెదంచల, గోదావరిపురం, వీరరామచంద్రపురం, చినంచల, గంగువాడ, ఈదురాపల్లి, కేదారిపురం, కంబిరిగాం గ్రామాల ప్రజలకు అనుకూలంగా ఉంటుంది.

చిన్నారులకు చిత్రలేఖన పోటీలు



వేసిన చిత్రాలతో చిన్నారులు

టెక్కలి: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే విద్యతో పాటు చిత్రలేఖనంపై మక్కువ పెంచుకోవాలని టెక్కలి శాఖా గ్రంథాలయాధికారి బి.రూపావతి సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న కళాత్మక ప్రతిభను చిత్రలేఖనం ద్వారా వెలికితీయాలని సూచించారు.

పశువులకు జబ్బవాపు నివారణ టీకాలు



చీపుర్లపాడులో పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: కురుడు పంచాయతీ పాకివలస, మెండపేట గ్రామాల్లో 108 పశువులకు జబ్బవాపు నివారణకు ఉచితంగా టీకాలను వేసినట్టు కురుడు పశువైద్యాధికారి లఖినేని కిరణ్‌మార్ బుధవారం తెలిపారు. పాడిరైతులు తమ పశువులకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే తమను సంప్రదించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ శిబిరాలు ఏర్పాటు చేసి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తామన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ వార్షికోత్సవం



భక్తుల పూజలందుకుంటున్న ముత్యాలమ్మ

ఇచ్ఛాపురం రూరల్: భక్తుల కొంగు బంగారం, తిప్పనపుట్టుగ గ్రామస్తుల ఆరాధ్య దైవం ముత్యాలమ అమ్మవారి వార్షికోత్సవం బుధవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక యజ్ఞ పూజలు, మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. అనంతరం 24 గంటల పాటు భజనా కాలక్షేపం, అన్నసంతర్పణ కార్యక్రమాలు జరిగాయి.

నమ్మాళ్వర్‌కు అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న కోదండ రామాలయంలో నమ్మాళ్వార్ తిరునక్షత్ర పూజలు బుధవారం నిర్వహించారు. అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో ముందుగా భక్తులు పాలను తీసుకొని వచ్చి సమర్పించగా వాటిని నమ్మాళ్వార్‌కు అభిషేకం, పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు.

నేత్రపర్వంగా నృసింహస్వామి వేడుకలు



కవిటి:బొరివంకలో సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్న మహిళలు

● ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కవిటి: లక్ష్మీనరసింహ ఆలయాల్లో బుధవారం నరసింహస్వామి జయంతి వేడుకలు నేత్రపర్వంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కవిటి మండలంలోని రాజపురం అఖడా, కవిటి నరసింహ ఆలయంలో, బొరివంక చెల్లమ్మ గారివీధి ఆలయం, మాణిక్యపురం, బల్లిపుట్టుగ, బొరివంక శివాలయం ప్రాంగణంలోని ఆలయంలో ఆయా ఆలయాల ఉత్సవ కమిటీల నేతృత్వంలో స్వామివారి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా ఆలయాల సన్నిధిలో ఏర్పాటు చేసిన స్వామి వారి కుంకుమ పూజ కార్యక్రమాలకు భారీ సంఖ్యలో మహిళలు హాజరై అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులందరికీ మహా అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. నియోజవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భజనబృందం కళాకారులు ఆలపించిన సంగీత కచేరీలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



కంచిలి: పెద్దకొజ్జిరియా ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

కంచిలి: కంచిలి మండలంలోని పెద్దకొజ్జిరియా గ్రామంలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో నరసింహ స్వామి జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగా అర్చన, కుంకుమ పూజ, సహస్రనామ స్తోత్రం, కరవంబ స్తోత్రం పారాయణం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కవిటి: బొరివంక చెల్లెమ్మగారి వీధి ఆలయంలో పూజలందుకుంటున్న నరసింహస్వామి



కవిటి: బొరివంక శివాలయం ప్రాంగణంలో కొలువైన నరసింహస్వామి

అమరవీరులకు స్మారక నివాళి

వజ్రపుకొత్తూరు: మండలంలోని కొత్తపేట గ్రామంలో ఇటీవల నిర్మించిన వార్ స్మారక స్థూపం వద్ద నేతాజీ సైనిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం అమరవీరులకు నివాళులు అర్పించారు. కార్గిల్, ఇతర ప్రాంతాల్లో అమరులైన ధనరాజ్, రామారావు, గోపి తదితరులు విధి నిర్వహణలో వీరమరణం పొందారు. ఈ మేరకు గ్రామంలో ఉన్న 30 జవాన్లు స్థానిక వార్ స్మారక స్థూపం వద్ద జై జవాన్ అంటూ నినాదాలు చేసి దేశం కోసం వారు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారంతా వీర వనితలు, వీర మాతలకు దుశ్శాలువలు వేసి పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అంబటి శ్రీను, నేతాజీ సైనిక సంఘం అధ్యక్షుడు ఎ.పాపినాయుడు, ఉపాధ్యక్షుడు ఎస్.రెయ్యినాయుడు, కార్యదర్శి డి.రాజారావు, సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



అమరులైన సైనికులకు నివాళులర్పిస్తున్న ఆర్మీ జవాన్లు

వైభవంగా అసిరిపోలమ్మ సంబరం



ఆకట్టుకుంటున్న శ్రీకృష్ణపరమాత్మ రథం

కవిటి: మండలంలోని నెలవంక గ్రామదేవత అసిరి పోలమ్మ అమ్మవారి నవరాత్రుల సంబరమహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారి పండుగల్ని చూసేందుకు ఎగబడుతున్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వెలుగులు చూపరుల్ని ఆకట్టుకుంటున్నాయి. వీధుల్లో ఏర్పాటు చేసిన రథాలు, వీధినాటకాలు అలరిస్తున్నాయి.

ఆవు ప్రాణాలు కాపాడిన '1962' సిబ్బంది

కాశీబుగ్గ: పలాస మండలం రామక్రిష్టాపురం జాతీయ రహదారిపై ఓ ఆవును గుర్తు తెలియని వాహనం బుధవారం ఢీకొట్టింది. దీంతో ఆవుకు కాలు విరిగిపోవడంతో ప్రాణాపాయానికి చేరుకుంది. పరిస్థితిని గుర్తించిన స్థానికులు 1962కు ఫోన్ చేసి విషయాన్ని తెలియజేశారు. దీంతో అంబులేటరీ (ఎంఏవీసీ) వాహనం ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన ఆవును అందులో సిబ్బంది ఎక్కించుకొని తీసుకొని పలాస పశువైద్య కేంద్రానికి తరలించారు. వైద్యులు ఆవు కాలుకు ఆపరేషన్ చేశారు. అనంతరం ఆవు యజమాని సత్యనారాయణ ఇంటికి అప్పగించారు. ఈ సేవలలో ఎల్ఎస్ఏ కల్యాణ్, అంబులేటర్ డాక్టర్ భానుమతి, పైలెట్ బోర అశోక్ కుమార్‌రెడ్డి ఉన్నారు.



ఆవును అంబులేటరీలో తరలిస్తున్న పశువైద్య సిబ్బంది

ఉచిత నేత్ర వైద్య శిబిరం



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తూరు: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా 97 మందికి స్థానిక సీహెచ్‌సీకి చెందిన ఆప్తాలమిక్ ఇప్పిలి జానకిరామయ్య కంటి పరీక్షలు నిర్వహించారు. 31 మందిని ఆపరేషన్‌కు సిఫార్సు చేశారు.

పోలీసుల కార్డన్ సెర్చ్



ఇచ్ఛాపురం రూరల్: స్వాధీనం చేస్తున్న వాహనాలతో ఎస్సైలు లక్ష్మణరావు, రాములు

● పలు వాహనాలు స్వాధీనం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బాలకృష్ణాపురం గ్రామంలో ఇచ్ఛాపురం రూరల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎటువంటి అనుమతి పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను స్వాధీన పరచుకున్నారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు 144 సెక్షన్ అమల్లో ఉందని అన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గ్రామాల్లో ఇటువంటి తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. తనిఖీల్లో కవిటి ఎస్సై రాము, ఇచ్ఛాపురం రూరల్, కవిటి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జేఆర్‌సీ పురంలో..

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీసు డివిజన్ అధికారి (డీఎస్పీ) నాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ముడోవార్డు జయరామచంద్రపురం గ్రామంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎటువంటి వివాదాలు జరగకూడదని, నాటుసారా, ఒడిశా మద్యం, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు అవకాశం ఉండకూడదని సోదాలు చేపట్టారు. ఎస్ఐ వెంకటరావు, ఏఎస్సైలు సంజీవరావు, ప్రకాశరావు, క్రైం హెచ్‌సీ శ్రీనివాసరావు, హెచ్‌సీ రవికుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కాశీబుగ్గ: జేఆర్‌సీపురంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు



టెక్కలి రూరల్: వాహన రికార్డులు పరిశీలిస్తున్న ఎస్సై లక్ష్మి, సిబ్బంది

సోగ్గాడిపేటలో..

టెక్కలి రూరల్: స్థానిక సోగ్గాడిపేటలో బుధవారం ఉదయం టెక్కలి ఎస్సై లక్ష్మి ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. వీధుల్లో అనుమానంగా తిరుగుతున్నవారిని ప్రశ్నించి వారి అధార్ కార్డులను పరిశీలించారు. ఎన్నికల ఫలితాలు త్వరలో వెలువడనున్న నేపథ్యంలో ఇళ్లలో బాణసంచా సామగ్రి ఏమైనా ఉందా అని తనిఖీలు చేశారు. ఇళ్ల ముందు ఉన్న వాహనాలను పరిశీలించి రికార్డులు లేని నాలుగు ద్విచక్ర వాహనాను అదుపులో తీసుకున్నారు. టెక్కలి ఎస్సై వెంకటరమణ, కేశవరావు సిబ్బంది ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989–1990 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు పులిపుట్టి వద్ద కన్నెధార కొండ మీద నిర్మించిన రామాలయ రోడ్డు నిర్మాణానికి రూ.64,400ల విరాళాన్ని బుధవారం అందజేశారు. రామాలయం రోడ్డు బాగులేకపోవడంతో భక్తులు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నందున, స్పందించిన విద్యార్థులు బీటీ రోడ్డు వేసేందుకు విరాళం ఇచ్చినట్లు ఆలయ నిర్వాహకుడు పిండి శ్రీనివాసరావు, సభ్యులు పడాల వెంకటకృష్ణ, సన్నిబోయిన గోపి, బోగి వెంకటరమణలు తెలియజేశారు.



ఆలయ నిర్వాహకులతో పూర్వ విద్యార్థులు

లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్‌గా రవికుమార్

శ్రీకాకుళం అర్బన్: లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్‌గా పొన్నాడ రవికుమార్ నియమితులయ్యారు. 2024–2025 సంవత్సరానికిగాను 316 ఏ గవర్నర్ ఎన్.వి.బి.ఎస్.ఎస్.ప్రసాద్ నేతృత్వంలో ఈయన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. సభ్యుల అందరి సహకారంతోనే చైర్మన్ పదవి దక్కిందన్నారు. 2019లో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సభ్యునిగా ప్రస్థానం ప్రారంభించిన తర్వాత క్లబ్ ట్రెజరర్‌గా, సెక్రటరీగా, క్లబ్ వైస్ ప్రెసిడెంట్‌గా సేవలు అందించినట్టు చెప్పారు. 2023–24 కాలానికి క్లబ్ ప్రెసిడెంట్‌గా జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలతోపాటు, ప్రజలకు అందుబాటులో ఉండే అవకాశం వచ్చిందన్నారు. తాను చేసిన సేవా కార్యక్రమాలు గుర్తించిన క్లబ్ మెంటార్ నటుకుల మోహన్ లయన్స్‌క్లబ్ గవర్నర్‌కు సిఫార్సు చేసి జోన్ చైర్మన్‌గా చేసినందులకు కృతజ్ఞతలు తెలియజేశారు. రవికుమార్‌ను డాక్టర్ బి.దేవభూషణరావు, డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, డాక్టర్ పైడి సింధూర, సభ్యులు ఉర్లం శివతేజ తదితరులు అభినందించారు.

జీవవైవిధ్య సదస్సుకు బ్రాహ్మణతర్లా ఉపాధ్యాయుడు

పలాస: విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో బుధవారం ప్రారంభమైన జాతీయ జీవ వైవిధ్య సదస్సులో పలాస మండలం బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు కొయ్యల శ్రీనివాసరావు పాల్గొని తన ప్రతిభను కనబర్చారు. జాతీయ జీవ వైవిధ్య సంస్థ, ఆంధ్రప్రదేశ్ జీవ వైవిధ్య మండలి సంయుక్తంగా ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. దేశంలోని ఎనిమిది రాష్ట్రాలకు చెందిన జీవ వైవిధ్య సంస్థలు ప్రదర్శించిన స్టాల్‌లను అనేక మంది సందర్శించారు. జీవ వైవిధ్యంపై శాస్త్రవేత్తలు పరిశోధన సెమినార్లకు హాజరయ్యారు. వారు నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవ వైవిధ్య కోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు. గురువారం కూడా సదస్సు జరగనుంది.



జీవ వైవిధ్య ప్రదర్శనలో శ్రీనివాసరావు

మండల కేంద్రానికి చేరిన పాఠ్యపుస్తకాలు

ఇచ్ఛాపురం: ప్రభుత్వం విద్యా దీవెన పథకం ద్వారా సరఫరా చేస్తున్న పాఠ్యపుస్తకాలు మండల కేంద్రానికి చేరాయని ఎంఈవో కె.అప్పారావు బుధవారం తెలిపారు. మండలానికి సంబంధించి పదో తరగతి వరకు ఉన్న 10,150 మంది విద్యార్థులకు ఎస్ఏ-1 కి సంబంధించి తెలుగు, ఇంగ్లిష్, మీడియాలకు సంబంధించి 46,294 పాఠ్య పుస్తకాలు రావలసి ఉందన్నారు. అయితే బుధవారం 22 వేల పాఠ్యపుస్తకాలు మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్ ప్రభుత్వోన్నత పాఠశాలకు చేరినట్టు చెప్పారు. ఈ పుస్తకాలను సమగ్రశిక్షా (ఎస్ఎస్ఏ) సిబ్బంది తరగతుల వారీగా స్టాక్‌పాయింట్‌ల్లో చేర్చారు.



పాఠ్యపుస్తకాలను భద్రపరుస్తున్న సిబ్బంది

రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనులు ప్రారంభం

కాశీబుగ్గ: ఖుర్దా రైల్వే డివిజన్ పరిధిలో ఉన్న పలాస రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. పలాస రైల్వే క్రీడా మైదానం, రైల్వే కార్యాలయాలకు, సుమారు వందకుపైగా ఉన్నటువంటి క్వార్టర్లకు మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేస్తున్నారు. నీరు వచ్చినప్పుడు పట్టుకోవడంతో పాటు ప్రతీ ఇంటివద్ద ట్యాంక్‌ను సైతం ఏర్పాటు చేయనున్నారు. అందుకు పూర్తి స్థాయిలో రైల్వే పరిసర ప్రాంతాలలో శరవేగంగా పైపులైన్ పనులు జరుగుతున్నాయి. ప్రతీ క్వార్టర్‌కు తాగునీటి కుళాయి ఏర్పాటుపై పలాస రైల్వేస్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యులు డబ్బీరు భవానీశంకర్, మీసాల సురేష్, పి.వి.సతీష్, బల్ల రేవతి, మల్లా సురేష్, విశ్వేశ్వరరావు హర్షం వ్యక్త చేశారు. పనులు మంజూరు చేసిన రైల్వే జీఎం, డీఆర్ఎం, కమర్షియల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారులుక ధన్యవాదాలు తెలియజేశారు.



పైపులైన్ పనులు జరుగుతున్న దృశ్యం

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ఇచ్ఛాపురం: వాహనాలు నడిపేటప్పుడు యువత అప్రమత్తంగా ఉండాలని ఇచ్ఛాపురం పట్టణ సబ్ఇన్‌స్పెక్టర్ వి.సత్యన్నారాయణ సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని దినవారిబజారు, ఏఎస్‌పేట, బస్టాండ్ కూడలిలో ద్విచక్ర వాహనాలను బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహన చోదకులకు ట్రాఫిక్ నియమాలపై ఎస్సై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, విధిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు నడిపేందుకు ప్రోత్సహిస్తే అలాంటి వారిపై కేసు నమోదు చేస్తామన్నారు.



ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గొడవలు వద్దు..ఐక్యతేముద్దు



పెద్దసాన గ్రామంలో మాట్లాడుతున్న సీఐ పైడయ్య

● టెక్కలి సీఐ పైడయ్య

టెక్కలి రూరల్: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మరి కొద్ది రోజుల్లో వెలువడనున్న నేపథ్యంలో ఎవరూ గొడవలకు దిగవద్దని టెక్కలి సీఐ పైడయ్య కోరారు. బుధవారం రాత్రి మండలంలోని పెద్దసాన, పోలవరం గ్రామాల్లో శాంతిభద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొడవలు వద్దు..ఐక్యతే ముద్దనే సూత్రాన్ని ప్రాజలు పాటించాలన్నారు. అనవసరంగా గొడవల్లో తలదూర్చితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతానికి 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులుగా ఎవరూ తిరగవద్దని సూచించారు. ఎన్నికల్లో ఎవరూ గెలిచినా మరోకరి మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించకూడదని, సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్టులు పెట్టడం, పార్వర్డ్ చెయ్యడం వంటివి చేయరాదన్నారు.

నేడు తాళ్లపాక జయంతోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: తాళ్లపాక అన్నమాచార్య జయంతోత్సవాలను గురువారం నగరంలోని పలు చోట్ల నిర్వహించనున్నారు. వాడడకు చెందిన తరిణి కృష్ణ స్మారక సేవా ట్రస్టు, శృతిలయ సంగీత శిక్షణాలయం సంయుక్త నిర్వహణలో అన్నమాచార్య 616వ జయంతి వేడుకలను స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థ మొదటి అంతస్తులో నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు మండ శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కత్తెరవీధిలోని రాజరాజేశ్వరీదేవి పీఠంలో పౌర్ణమి సందర్భంగా శ్యామా వార్తాలి సమేత రాజరాజేశ్వరీ దేవికి శ్రీచక్ర లఘు నవావరణ పూజ, అలాగే తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సుసరాపు లక్ష్మీగణపతి శర్మ తెలిపారు. డీసీసీబీ కాలనీలోని శ్రీభూసమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కూడా అన్నమాచార్య జయంతిని పురస్కరించుకొని సంకీర్తనా గానం సాయంత్రం ఐదు గంటలకు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు బిర్లంగి రామ్మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీవాణి సంగీత కళాక్షేత్రం నిర్వాహకులు దుంపల ఈశ్వరరావు ఆధ్వర్యంలో నాదార్చనను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.